

దాడులు హేయమైన చర్య

మహిళా వైద్యులపై దాడులు హేయమైన చర్య. పవిత్రమైన వైద్య వృత్తిని చేసేందుకు మహిళలు ముందుకురావడాన్ని అభినందించాలి. కాని కొంతమంది వ్యక్తులు వైద్యులపై దాడులు చేయడం దారుణం. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం చాలా బాధాకరం. నిందితులను శిక్షించేందుకు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. ఆస్పత్రుల్లో వైద్యులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– పి.శిరీష, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, తాళ్లరేవు





ప్రతి ఒక్కరూ ఖండించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఘటన జరిగి రెండు వారాలు దాటినా ఇప్పటివరకూ మిగిలిన నిందితులను అరెస్టు చేయలేదు. కఠిన చట్టాలు రానిదే ఇలాంటి అరాచకాలు ఆగవు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నిర్భయ, అభయ లాంటి పేర్లు మానేసి మహిళలను, మహిళా వైద్యులను రక్షించేలా చూడాలి. – డాక్టర్ గాయత్రి, పీహెచ్‌సీ వైద్యాధికారి, కేశనకుర్రు, ఐ.పోలవరం మండలం

క్లుప్తంగా

చినుకు పడితే గోదారే



దేవగుప్తంలోని రామాలయం వీధిలో నిలిచిపోయిన వర్షం నీరు

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో రామాలయం వీధిలో వర్షం నీరు దిగేందుకు మార్గం కరవైంది. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచిపోతుంది. దీంతో రామాలయం వీధిలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి వారే ఇళ్ల ముందు మట్టిని మెరకగా వేసుకోవడంతో నీరు దిగే మార్గం లేక వర్షకాలం నుంచి సీసీ రోడ్డుపై వర్షం నీరు దర్శనమిస్తుంది. మురుగునీరు పారేందుకు డ్రెయిన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిప్‌మెర్‌లో సీటు సాధించిన విద్యార్థిని



విజయలక్ష్మి

యానాం: పుదుచ్చేరిలో జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్)లో యానాం రీజెన్సీ జూనియర్ కళాశాల విద్యార్థిని ర్యాలి విజయలక్ష్మి ఎంబీబీఎస్ సీటు సాధించిందని ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయలక్ష్మి నీట్‌లో 550 మార్కులు సాధించిందన్నారు. ఈ సందర్భంగా రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎస్‌నాయుడు ఆమెను అభినందించారు.

12 మంది విద్యార్థుల రక్తదానం



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తలసేమియా రోగులు, గర్భిణులకు రక్తం అత్యవసరం కావడంతో అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 12 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులు దుర్గారావు, కార్తీక్, ప్రవీణ్, సునీల్, మధుసూదనరావు, కరుణామయి, ప్రశాంత్‌కుమార్, సుబ్రహ్మణ్యం, నెహ్రూ, మహ్మద్ అలీ, సుధాకర్, బాలాజీలను యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్, ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి దొడ్డా కాశీ తదితరులు అభినందించారు.

అంధ విద్యార్థులకు వితరణ

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తన కుమారుడు సురేంద్ర పుట్టినరోజు సందర్భంగా స్థానిక లూయీ అంధుల పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లను శనివారం పంచిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ముమ్మిడివరం: మండల పరిధిలోని అనాతవరానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మట్టపర్తి వీర వెంకట సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శనివారం ఉదయం మోటార్ సైకిల్‌పై స్వగ్రామమైన అనాతవరం వెళుతుండగా కారు ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన సత్యనారాయణను అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం హెడ్ కానిస్టేబుల్ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



మాధవరాయునిపేటలో కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

తాళ్లరేవు: తల్లిని కోల్పోయిన చిన్నారుల ఉన్నత చదువులకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ముమ్మిడివరం ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు ఆర్థిక సాయం చేశారు. తాళ్లరేవు పంచాయతీ మాధవరాయునిపేట గ్రామానికి చెందిన దంగేటి లక్ష్మి ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. ఆమె భర్త దంగేటి కృష్ణ ఒలుపు దింపు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబాన్ని మంత్రి సుభాష్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ రూ.20 వేలు, శివన్నారాయణ రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, రెడ్డి శివాజీ, పితాని శ్రీను, గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీను, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో టిడ్కో ఇళ్లు

అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం





జల దిగ్బంధంలో చిక్కుకున్న బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్లు (శనివారం నాటి పరిస్థితి)

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని పేదలు నివసించే బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయాలకు సంబంధించిన అపార్ట్‌మెంట్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఇక్కడ నివసిస్తున్న 1,632 కుటుంబాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు టిడ్కోకు చెందిన 51 అపార్ట్‌మెంట్ల చుట్టూ ముంపు నీరు నిలిచిపోయి పిల్ల కాల్వలను తలపిస్తున్నాయి. టిడ్కో ఇళ్ల సముదాయానికి సీసీ రోడ్లు వంటి సౌకర్యాలున్నా ముంపు నీరు వెళ్లేందుకు అవుట్ ఫాల్ డ్రెయిన్ లేకపోవడంతో నివాసితులు ముంపు సమస్యతో సతమతమవుతున్నారు.

ప్రతిపాదనలు పట్టాలెక్కిస్తేనే

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికలకు ఆరు నెలల ముందు అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించి దాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. అయితే ఎన్నికల కారణంగా ఆ ప్రతిపాదనకు బ్రేకులు పడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అత్యవరంగా టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మిస్తేనే ఈ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. 2014–19 సంవత్సరాల మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ టిడ్కో ఇళ్ల అపార్ట్‌మెంట్లను పల్లంలో నిర్మించడం వల్ల ముంపు పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ముంపు నీటితో పాటు అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్‌లు చెమ్మగా మారి నివాసితులు అసౌకర్యానికి గురవుతున్నారు. గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు తరుచూ ముంపునకు గురికావడం, కొద్దిగా ఆరుదల కనిపించినా నేలంతా బురద పేరుకుపోయి మరింత అవస్థలు పడతున్నారు.

రూ.1.50 కోట్లు అవసరం

ముంపు సమస్యలు, పారిశుధ్య ఇబ్బందులపై ఇటీవల సాక్షిలో 'టిడ్కో... అసౌకర్యాలివిగో' అనే శీర్షికను ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి రెగ్యులర్‌గా ఉన్న నలుగురి పారిశుధ్య కార్మికులతో పాటు వారానికో రోజు 30 మంది కార్మికులతో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించే ఏర్పాట్లు చేశారు. టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద రూ.1.5 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించాల్సిన అవుట్ ఫాల్ డ్రెయిన్ అందుబాటులోకి వస్తేనే గాని ఈ తీవ్ర సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. మున్సిపల్ సాధారణ నిధులతో రూ.1.50 కోట్లు వెచ్చించడం సాధ్యం కాదు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంటు విడుదలైతేనే అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి పునాది రాయి పడుతుంది.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు

అమలాపురం టౌన్: విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాలు వంటి దురలవాట్లకు దూరంగా ఉండి విద్యా, నైతిక విలువలు నేర్చుకోవాలని అమలాపురం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు సూచించారు. స్థానిక వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ అండ్ ప్రొటెక్షన్ స్కీమ్, మత్తు పదార్థాలు సేవిస్తే వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది వీకేఎస్ భాస్కరశాస్త్రి మాట్లాడుతూ నేటి ఉత్తమ విద్యార్థులే రేపటి ఉత్తమ పౌరులన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ కిషోర్‌బాబు, సీనియర్ న్యాయవాది పీవీవీఎస్ మూర్తి(బాబి), కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్ సదస్సు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావును కళాశాల తరపున ఘనంగా సత్కరించారు.

విద్యాలయాలకు మురుగు నీటి ముంపు



మున్సిపల్ డ్రైనేజీ మూసుకుపోవడంతో మన్నా విద్యా సంస్థల ప్రాంగణాన్ని ముంచెత్తిన మురుగు నీరు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి ఎదురుగా ఉన్న మిరియాం విద్యా సంస్థల ప్రాంగణంలోని మున్సిపల్ డ్రెయిన్ మూసుకుపోవడంతో ఆ ప్రాంతాన్ని మురుగునీరు ముంచెత్తింది. మిరియాం విద్యా సంస్థల ప్రాంగణంలో చిల్డ్రన్ హోమ్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, పరంజ్యోతి, మిరియాం జూనియర్ కళాశాలలు, జ్యోతి ఐటీఐ, ఓ ఆస్పత్రి ఉన్నాయి. విద్యా సంస్థల ప్రాంగణంలో డ్రెయినేజీ నీరు నిలిచిపోవడంతో అక్కడ చదువుతున్న వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై రెండు వారాల కిందటే మున్సిపల్ అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మిరియాం విద్యా సంస్థల అధినేత కార్ల్ డేవిడ్ కొమనాపల్లి(లాల్) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తమ విద్యా సంస్థల ప్రాంగణం మురుగు నీరు డ్రెయినేజీ అవుట్ లెట్ ద్వారా తామర చెరువు మీదుగా వెళ్లేదని లాల్ పేర్కొన్నారు. ఇప్పుడు ఈ డ్రెయిన్ ప్రవహించే మార్గాన్ని కొంత మంది ఆక్రమించుకుని దుకాణాలు నిర్మించడం వల్ల మురుగునీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి తమ విద్యా సంస్థల ప్రాంగణంలో నెలకొన్న మురుగు నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



వీరేశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి మల్లిఖార్జునరావు దంపతులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లిఖార్జునరావు దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత ఆయనకు సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామల కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి దంపతులను పట్టు వస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అనకాపల్లి పేలుడుపై పూర్తి విచారణ జరపాలి



యానాంలో పరిశ్రమల వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

యానాం: అనకాపల్లి రాంబిల్లి సెజ్‌లో ఎసెన్సియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి కార్మికులు, ఉద్యోగులు మృతి చెందిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. అనకాపల్లి ఘటన నేపథ్యంలో శనివారం యానాంలో సైతం పరిశ్రమల్లో భద్రత, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ పరిశ్రమల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమల తనిఖీలపై నియంత్రణ విధించడమే ప్రమాదాలకు కారణమని, అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కోర్ యాక్టివిటీలో నైపుణ్యం లేని కాంట్రాక్టు కార్మికులతో తక్కువ వేతనాలతో పనిచేయించడం, రక్షణ సౌకర్యాలపై ఖర్చు చేయకుండా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ కుంచె సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, దాసరి రాజు, కె దొరబాబు, జోగారావు, సోమరాజు, డి.రాజు, కె.నూకాంబరం, వాకపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిండా ముంచిన వర్షం



ఉప్పలగుప్తంలో నీట మునిగిన పేరాయిచెరువు రహదారి



భీమనపల్లిలో నీట మునిగిన వరి చేను

ఉప్పలగుప్తం: మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి వరి చేలు నీట మునిగాయి. రహదారులు జలమయమయ్యాయి. చాలాచోట్ల పొలాలు నీట మునిగాయి. గత నెలలో గోదావరి వరద, భారీ వర్షాల కారణంగా గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగి నారుమడులు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సైతం తీవ్రంగా జాప్యమైంది. వ్యవసాయాధికారుల సూచనతో మళ్లీ నారుమడులు వేసుకున్న రైతులు శనివారం నాటి భారీ వర్షంతో మళ్లీ ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. అయితే సాయంత్రానికి వర్షం తెరిపినివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

స్టాఫ్ రూమ్‌గా మారిన అటల్ టింకరింగ్ ల్యాబ్



దేవగుప్తం ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఉపాధ్యాయుల విశ్రాంతి రూమ్‌గా మార్చిన దృశ్యం

అల్లవరం: విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికి తీసి సరికొత్త ఆవిష్కరణలను సృష్టించేందుకు దేవగుప్తం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను విశ్రాంతి రూమ్‌గా మార్చేశారు. గత ప్రభుత్వ హయాంలో దేవగుప్తం ఉన్నత పాఠశాలలకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను మంజూరుచేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు సైన్సు ప్రయోగాలు ఆవిష్కరించి, విద్య, వైజ్ఞానిక సదస్సుల్లో ప్రదర్శించవలసి ఉంది. అయితే ఉపాధ్యాయులు విశ్రాంతి తీసుకోవడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఎంపిక చేసుకున్నారు. దీంతో ల్యాబ్‌లో ప్రయోగాలు చేసే అవకాశాన్ని విద్యార్థులు కోల్పోయారు. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు, తొలి, రెండో విడతల్లో దేవగుప్తం ఉన్నత స్కూల్‌ని అందంగా తీర్చిదిద్ది, విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా అదనపు తరగతి గదులు నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చారు. అయినా అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఉపాధ్యాయుల విశ్రాంతి రూమ్‌గా వినియోగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఉపాధి ఆడిట్‌లో రూ.1.16 లక్షల రికవరీకి ఆదేశం

పి.గన్నవరం: గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద మండలంలో నిర్వహించిన పనులకు గాను రూ.1.16 లక్షలు తేడా ఉన్నట్టు గుర్తించి, ఆ సొమ్మును సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని డ్వామా పీడీ మధుసూదనరావు ఆదేశించారు. మండలంలో 2023–24 సంవత్సరానికి గాను మొత్తం రూ.8,31,13,642ల మేర ఖర్చు చేశారు. ఇందులో రూ.8,16,60,139లను కూలీలకు వేతనాలుగా, రూ.14,53,503లు మెటీరియల్‌కు చెల్లించారు. ఈ పనులపై గ్రామాల్లో ఇటీవల సామాజిక తనిఖీ చేశారు. అయితే ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.85,000, పంచాయతీ రాజ్‌కు సంబంధించి రూ.31,000 తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సొమ్మును రికవరీ చేయాలని పీడీ మధుసూదనరావు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా ప్రజలకు మేలు చేసే విధంగా ఉపాధి పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భీమేశ్వర్, అంబుడ్స్‌మన్ మల్లికార్జున్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీఓ సీహెచ్ లక్ష్మీ నారాయణ, సీఆర్‌పీ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

పి.గన్నవరం: మండలంలోని ఎల్.గన్నవరంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి స్థానిక జనసేన పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు రాజకీయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఆ ప్రాంతానికి సుమారు 100 మంది కూలీలు వచ్చి ఆందోళన నిర్వహించారు. ఉపాధి కూలీలకు అన్యాయం జరిగే విధంగా తమ గ్రామ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. తమ గ్రామంలో ఉపాధి పనుల్లో రాజకీయాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ, సర్పంచ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వెనుదిరిగారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు యన్నాబత్తుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంతానలేమి, స్త్రీల వ్యాధులకు ఉచిత వైద్య సేవలు



రావులపాలెం సత్యసాయి మందిరంలో స్త్రీలను పరీక్షిస్తున్న ప్రదీప్తి కరుణ

కొత్తపేట/రావులపాలెం: రావులపాలెం సత్యసాయి సేవా కేంద్రంలో శనివారం సంతానలేమి, స్త్రీల వ్యాధుల ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహించారు. కొత్తపేట భాస్కర ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆ సెంటర్ సౌజన్యంతో ప్రముఖ గైనకాలజిస్టు, ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ స్పెషలిస్టు డాక్టర్ ప్రదీప్తికరుణతో పాటు రాజమహేంద్రవరానికి చెందిన ఐవీఎఫ్ స్పెషలిస్టు ఫెర్టిలిటీ డాక్టర్ లక్ష్మీప్రసన్న, డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న 64 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సంతానలేమి సమస్యలకు సంబంధించిన 30 మంది దంపతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉచితంగా మందులు అందజేశారు. సేవా కేంద్రం కోఆర్డినేటర్ మన్యం వర్ధనరావు తెలిపారు. ముందుగా ఈ వైద్య శిబిరాన్ని రావులపాలెం అష్టదళ సేవా పుష్పం ట్రస్ట్ చైర్మన్ ప్రారంభించగా, కొత్తపేట భాస్కర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు నడింపల్లి రామకృష్ణంరాజు, మన్యం పర్వతవర్ధనరావు, సిద్దిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట ఐవీఎఫ్ సెంటర్, భాస్కర ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

మోటార్ సైకిల్ చోరీ

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పెద్ద వంతెన సమీపంలో ఇంటి ఆవరణలో ఉంచిన మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. పిల్లి నాగరాజుకు చెందిన బుల్లెట్ మోటార్ సైకిల్ ఇంటి ఆవరణలో ఉంచి తాళం వేయగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు బాధితులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యానాం రిసార్ట్స్‌లో ఆక్రమణల తొలగింపు




అరటికాయలంకలోని యానాం రిసార్ట్స్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం పంచాయతీ అరటికాయలంక గ్రామంలో వృద్ధ గౌతమీ గోదావరిని ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగిస్తున్నారు. యానాం రిసార్ట్స్ పేరిట ప్రభుత్వ భూములను ఆక్రమించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారని పలువురు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇటీవల కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుల బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంగించినట్లు గుర్తించారు. అంతేకాకుండా ప్రభుత్వ పుంతను ఆక్రమించి పలు నిర్మాణాలు చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా నిర్మాణాల తొలగింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని రెవెన్యూ అధికారి సూరిబాబు తెలిపారు.

లైంగిక వ్యాధులపై అవగాహన సదస్సు

ముమ్మిడివరం: ముమ్మిడివరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అమలాపురం జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగిక వ్యాధులపై అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జన కల్యాణ్ ఔట్రీచ్ ప్రతినిధి సీహెచ్ శాంతి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ పి.అంజలాదేవి మాట్లాడుతూ హెచ్ఐవీ ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ద్వాక్రా అంగన్‌వాడీ కార్యదర్శి మెండి కమల, జనకల్యాణ్ సిబ్బంది, ఏఎన్ఎం కె.వెంకటరమణి, గుర్రాల అమల, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు పౌష్టికాహారాన్ని రుచిగా అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ–2 మోకా ప్రకాష్‌తో కలసి శనివారం పరిశీలించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంట చేసే ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించి రుచిగా ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించి తాగు నీరు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి నాణ్యత, రుచిపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి భవన నిర్మాణ పనులను హెచ్ఎం కడలి సాయి రామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.